క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోను అందజేత



శావల్యాపురం: సెల్‌ఫోన్ చోరీకి గురైన బాధితులు సమగ్ర ఆధారాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తుళ్లూరి తిరుపతిరావు అన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషనులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారికి వాటిని అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని బొందిలిపాలెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవరు కుంచాల వెంకటస్వామికి చెందిన రూ.17 వేలు విలువ చేసే సెల్‌ఫోను ఈనెల 7వ తేదీన చోరీకు గురవ్వగా, సాంకేతిక పరిజ్ఞానంతో ఈనెల 12వ తేదీన స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం సెల్‌ఫోనును ఆర్టీసీ డ్రైవరు వెంకటస్వామికి అందజేశారు.

స్వెనోమ్‌కు ఘనసత్కారం



వినుకొండ(నూజెండ్ల): అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్, నియోజవర్గ సంఘాల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ కో–ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్ జన్మదిన వేడుకలు స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వెనోమ్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం స్వెనోమ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు హైడ్‌రాజు, నియోజకవర్గ సెక్రటరీ గాంధీ, సంఘం వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం అధ్యక్షులు దేవ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, రామయ్య, మోషే, యాకోబు, అజరయ్యా, రాజు, రూబెన్, వెంకటేశ్వర్లు, గాలి కోటి, పాస్టర్ వెంకటేశ్వర్లు, దోరట్ల శ్రీను, విసీల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక సీపీఎం కార్యాలయంలో వినుకొండ డ్యాన్స్, డైరెక్షన్ అసోసియేషన్ జాషువా కళానికేతన్ పరిషత్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాటక కళాకారుల సంఘం సమావేశం నిర్వహించారు. తొలుత కళాకారుడు బూడిద లక్ష్మయ్య సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కళాకారులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, సంబంధిత పత్రాలను అధ్యక్షుడు నేలపట్ల హరిబాబుకు అందజేయాలని సూచించారు. ఎ.సాల్మన్‌రాజు, ఎం.కోటేశ్వరరావు, బి.వెంకటరావు, బి.వెంకటేష్, కె.పిచ్చయ్య, ఎం.ఏసోబు, ఎం.కోటయ్య, కె.నాగేశ్వరరావు, పి.ఎల్.కుమార్, డి.స్కైలాబ్, ఐ.రామకోటయ్య, దాచేపల్లి గోవిందు, డ్యాన్స్ మాస్టర్లు, డైరెక్టర్స్, కళాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం గ్రామం వద్ద ఆదివారం జరిగింది. వినుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈపూరు మండలం ఊడిజర్ల గ్రామానికి చెందిన ఆనంద్‌బాబు (27) బొల్లాపల్లి మండలం సరికొండపాలెంకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం ఆనంద్‌బాబు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పిచర్లలో ఇల్లు దగ్ధం

కారెంపూడి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఒప్పిచర్లలో ఇంట్లో పొలం పనులకు వెళ్లిన సమయంలో పూరింట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, దుస్తులు, ఇంట్లో ఉన్న మిగిలిన సొత్తు కాలిపోయింది. బాధితుడు సురతాని నాగాంజి మాట్లాడుతూ ఇంట్లో డ్వాక్రా రుణం డబ్బులు రూ.50 వేలు కూడా కాలిపోయాయని తెలిపాడు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



రొంపిచర్లలో టపాసులు వెలిగిస్తున్న చిన్నారులు

రొంపిచర్ల: మండల ప్రజలు దీపావళి పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దేవాలయాల్లో, గృహాల్లో ప్రత్యేక పూజలు, దీపాల అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి వేళ టపాసులను వెలిగించి సందడి చేశారు. మహిళలు రంగవల్లులను తీర్చిదిద్ది, దీపపు ప్రమిదలను వెలిగించి దీపావళి శోభను ఇనుమడింపజేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా పిలిచే దీపావళి పర్వదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా జరుపుకొన్నారు. కులమతాలకతీతంగా వేడుకలు చేసుకున్నారు. ఉదయం అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం బాణసంచా కాలుస్తూ చిన్నా పెద్దా తేడా లేకుండా సంబరాలు చేసుకున్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: దీపావళి పర్వదినాన్ని పట్టణంలో ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా బాణసంచా టపాసులతో సందడి చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద ఆదివారం, సోమవారం టపాసులు కొనుగోలు చేశారు. స్టేడియంలో లైసెన్స్‌దారులు 44 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈఏడాది బాణసంచా విక్రయాలు మందకొడిగా సాగినట్టు దుకాణదారులు చెబుతున్నారు. పండుగ ఎప్పుడు జరుపుకోవాలనే సందిగ్ధత ఉండటంతో సోమవారం కూడా బాణసంచా విక్రయాలు కొనసాగాయి.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి వారం రోజుల పాటు 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఆర్.సేవానాయక్ తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాధాన్యత, విజ్ఞాన పఠనం, గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారుల గురించి స్మరించుట, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడాకారులు, దిశ చట్టంపై అవగాహన వంటి అంశాలపై వివరించడం జరుగుతుందని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి తెలిపారు.

చిలకలూరిపేటటౌన్: గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని పట్టణంలోని శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జి ఎం.నాగుల్ మీరావలి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. తొలిరోజు మంగళవారం కార్యక్రమాలను శ్రీ విడదల నిహారిక ఫౌండేషన్ సంస్థ చైర్మన్ విడదల సాంబశివరావు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించి కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యత, అనుబంధం తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తారని, ప్రముఖులు పాల్గొని అవగాహన కల్పిస్తారని, ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

శావల్యాపురం: నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు శావల్యాపురం శాఖ గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, చదవటం మాకు ఇష్టం, కవి సమ్మేళనం, చిత్రలేఖన పోటీలు, దిశ చట్టం మహిళ సాధికారితపై పోటీలు నిర్వహిస్తామన్నారు.

నాదెండ్ల: నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ రావూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నుంచి 20వ తేది వరకూ వారోత్సవాలు జరుగుతాయన్నారు.

అగ్నిప్రమాద కుటుంబానికి అండగా ఉంటాం

తక్షణ సాయంగా రూ.15వేలు అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక 16వ వార్డు శ్రీరాంపురంలో అగ్నిప్రమాదానికి గురైన దుర్గా శ్రీనివాస్ ఇంటిని సందర్శించి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం నమోదు చేసి తగిన ఆర్థిక సహాయం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని నరసరావుపేట మండల తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్‌ను కోరారు. కాగా, తక్షణ సాయం కింద రూ.15వేలు ఆర్థిక సహాయం అందేశారు. వి. సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మూడుచోట్ల ‘వై ఏపీ నీడ్స్ జగన్’

నరసరావుపేట: నియోజకవర్గంలో మంగళవారం మూడు ప్రదేశాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలియ చేశాయి. పట్టణంలోని కుమ్మరిబజారు సచివాలయం, నరసరావుపేట మండలంలోని చినతురకపాలెం, రొంపిచర్ల మండలంలోని గోగులపాడు గ్రామ సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. కావు ఆయా ప్రాంతాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరాయి.

నేడు చందవరంలో....

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, వివిధ హోదాల్లో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

వావిలాలనగర్‌లో టీచర్ ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: స్థానిక వావిలాల నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. దీపావళిని పురస్కరించుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మానాయక్ కుటుంబ సభ్యులతో విజయవాడ వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేరని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలోని లాకర్‌లో భద్రపరిచిన 56 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కేజీ వెండి వస్తువులు, రూ.40 వేలు అపహరించుకుపోయారు. బాధితుడు సోమవారం తిరిగి రావడంతో ఇంటి తాళ్ళాలు పగలగొట్టి దొంగతనం జరిగిన ఆనవాళ్ళు కనిపించటంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పీ.ప్రభాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది.

భూగర్భ జలాల లభ్యతపై సర్వే



బోరుబావిలో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న వాటర్ ఎయిడ్ ఇండియా బ్లాక్ కో–ఆర్డినేటర్ గురుప్రసాద్

విజయపురిసౌత్: మాచర్ల మండలం పశువేములలో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్ ఎక్సర్‌సైజ్ ప్రారంభించినట్లు బ్లాక్ కో–ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ తెలిపారు. సోమవారం పశువేముల గ్రామంలో బోరు బావులలో నీటిమట్టాన్ని పరిశీలించారు. ఆయన మండల పరిధిలో పశువేములతో పాటు బ్రహ్మానందపురం తండా, రాయవరం, తుమ్మెపల్లి గ్రామాలలో మొత్తం ఎంత మంది జనాభా ఉన్నారు, పెంపుడు జంతువులు ఎన్ని ఉన్నాయో గుర్తించి నీటి వినియోగం ఎంత జరుగుతుందో తెలుసుకోవటంతో పాటు గ్రామాలలోని పొలాలకు సాగు నీరు ఎన్ని లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందని విషయం ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకోవటం జరుగుతుందని చెప్పారు. ఆయా గ్రామాలకు బోరు బావులు, కాలువల ద్వారా, వర్షం ద్వారా ఎన్ని లక్షల లీటర్ల నీరు అందుబాటులో ఉన్నాయో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగించే నీటి కంటే తక్కువ నీరు అందుబాటులో ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీరు వినియోగం కంటే ఎక్కువ శాతం నీరు ఉంటే వాటిని సంరక్షణ చేసే పద్ధతులు ఈ కార్యక్రమం ద్వారా చేపడతామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్ రవివర్మ, సర్పంచి కిన్నెర దేవదానం, వలంటీర్లు కర్రా విజేత, రోజా రాణిపాల్గొన్నారు.

కార్తిక ఆకాశ దీపోత్సవాలు



విప్పర్ల శివాలయంలో ధ్వజస్తంభానికి ఏర్పాటు చేసిన ఆకాశ దీపం



వడ్లమూడివారిపాలెం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో..

రొంపిచర్ల: మండలంలోని అన్ని దేవాలయాల్లో సోమవారం రాత్రి ఆకాశ దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్తిక మాసం విష్ణుమూర్తికి, శివునికి ఎంతో ప్రీతికరమైన మాసం. ఈ మాసం ప్రారంభం కాగానే అన్ని దేవాలయాల్లో ధ్వజస్తంభాలకి ఆకాశ దీపం ఏర్పాటు చేస్తారు. కార్తిక దీపం, ఆకాశ దీపానికి అవినాభావ సంబంధం ఉంది. చిన్ని చిన్న రంధ్రాలు చేసిన ఓ గుండ్రని ఇత్తడి పాత్రలో నూనె పోసి దీపాన్ని వెలిగించి తాడు సహాయంతో ధ్వజస్తంభం పై భాగాన వేలాడదీస్తారు. ఈ దీపాన్ని దర్శించుకోవడానికి భక్తులు దేవాలయానికి వెళ్తారు. ఈ దీపం ఆకాశ మార్గాన ప్రయాణించే పితృదేవతల కోసమని శాస్త్రాలు చెబుతున్నాయి. కార్తిక శుద్ధ పాడ్యం నుంచి పితృదేవతలు అంతా ఆకాశ మార్గాన తమ తమ లోకాలకు ప్రయాణిస్తుంటారు. ఆ సమయంలో వారికి మార్గం సరిగా కనిపించడం కోసం ఆలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగిస్తారని పండితులు చెబుతారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



పోటీలలో గెలుపొందిన చిన్నారులతో వైఎంసీఏ సభ్యులు

చిలకలూరిపేట: చిన్న వయసు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని నరసరావుపేట సీడీపీఓ బి.మాణిక్యాలరావు చెప్పారు. వైఎంసీఏ చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దండమూడి గ్రామంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎంసీఏ సంస్థ గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం వలన భవిష్యత్తులో మంచి క్రీడాకారులు రూపొందుతారని కొనియాడారు. వైఎంసీఏ గౌరవ అధ్యక్షుడు చుక్కా విన్సెంట్‌పాల్, అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు, కోశాధికారి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాసోత్సవాలకు సమాయత్తం

- సత్తెనపల్లిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- పెద్ద సంఖ్యలో హాజరు కానున్న భక్తులు



పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని శివాలయం



వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో పూలతో అలంకరణ

సత్తెనపల్లి: పవిత్ర కార్తిక మాసోత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబు అయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూ లైన్‌లతోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి శైవ క్షేత్రాలకు రానున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలకు వీలుగా ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేపట్టారు. స్వామికి నిత్యం అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంతో పాటు రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లిలోని శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు వీరాంజినేయులు, గంగయ్య, కోటేశ్వరరమ్మ, సామ్రాజ్యమ్మ, పోట్లూరి పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, ప్రయాణికులతో వస్తున్న ఆటో ఢీకొంది. సంఘటనలో బాపట్ల జిల్లా కారుమంచి గ్రామానికి చెందిన వెంకటప్పయ్యతో పాటు మరో బాలుడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

నరసరావుపేట టౌన్: అగ్ని ప్రమాదం సంభవించి రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపురంలోని ఆత్మకూరి దుర్గా శ్రీనివాస్ చీపురు పుల్లల దుకాణం నిర్వహిస్తున్నాడు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి దుకాణంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

నేడు రెండుచోట్ల ఆరోగ్య సురక్ష శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలో మంగళవారం రెండు ప్రదేశాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం వెల్లడించారు. పట్టణంలోని బరంపేట పీహెచ్‌సీ వైద్యశాలలోను, అలాగే మండలంలోని పమిడిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు శిబిరాలకు తరలి వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రముఖ వ్యాపారి అదృశ్యం



పెదకూరపాడు: ప్రముఖ వ్యాపారి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు ఆతుకూరి వెంకటేశ్వర్లు ఫ్యాన్సీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ ఆరోగ్య సమస్యలపై హైదరాబాద్ వెళ్లి వస్తానంటూ కారులో వెళ్లాడు. కారును గుంటూరు రైల్వే స్టేషన్‌లో పార్కు చేసి హైదరాబాద్ వెళ్లాడు. ఇప్పటికి తిరిగిరాకపోడడం, ఫోను కూడా స్విచ్ ఆఫ్ ఉండడంతో కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితుల వద్దకు వెళ్లి విచారించారు. సమాచారం లేకపోవడంతో కుమారుడు బాలసాయి కుమార్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు. వెంకటేశ్వర్లు వయసు 52 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. ఆచూకి తెలిసిన వారు 83282 09174, 92471 35262, 94407 96269 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణ శివారులోని కోర్టు సమీపంలో సురేష్(30) ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రజక ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయండి



బ్రాహ్మణపల్లిలో చలో గుంటూరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

పిడుగురాళ్ల రూరల్: రజకులకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం ఐక్యవేదిక లీగల్ సెల్ అధ్యక్షుడు కంభంపాటి కోటేశ్వరరావు కోరారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, జానపాడు, పందిటివారిపాలెం, పెద అగ్రహారం, కామేపల్లి తదితర గ్రామాల్లో రజక ఆత్మగౌరవ మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ గుంటూరులో నిర్వహించనున్న రజక ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు రజక సంఘ నాయకులు బలుగూరి రామారావు, సీతరామయ్య, నాసరయ్య, చిన్న వెంకటేశ్వర్లు, వెంకటేవ్వర్లు, బలుగూరి సీతరామయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

మాదల(ముప్పాళ్ల): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశానుసారం మండలంలోని మాదలలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని సత్తెనపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్, సత్తెనపల్లి ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం నాయకులు పరామర్శించి శనివారం ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చల్లంచర్ల సాంబశివరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ చెప్పారు. తమ వంతుగా రూ.2లక్షలు బాధిత కుటుంబ సభ్యులు పొట్టి శ్రీనివాసరావు, చిన్నారావులకు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్రం సంఘం అధ్యక్షులు సింగరి మధుసూదనరావు, సత్తెనపల్లి ఆ.వో.పా. అధ్యక్షులు దివ్వెల శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచి సైదా, వైఎస్సార్ సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, చిమటా శ్రీనివాసరావు, దమ్మాలపాటి బుజ్జి, ఆర్యవైశ్య సంఘం నాయకులు జవ్వాజి రామ్మోహనరావు, దేవతి సుబ్బారావు, కొత్త లక్ష్మయ్య, కొత్తూరి విశ్వేశ్వరరావు, మాడ రమేష్, వేమా ప్రసాదు, రావికింది మల్లికార్జునరావు, పొట్టి మురళి, జమిలి రాధాకృష్ణమూర్తి, తొమ్మండ్రు సత్యనారాయణ, అన్నం వేణు, మల్లికార్జునరావు, రావికింది సుబ్బారావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గురజాల: ప్రమాదం తృటిలో తప్పింది. నగర పంచాయతీ పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో స్తంభం కిందపడిపోయింది. ఆ ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని యథాస్థితిలోకి ఏర్పాటు చేశారు.